క్లుప్తంగా

అన్నదానం

ప్రొద్దుటూరు : స్థానిక 39వ వార్డులో వలసాని స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వలసాని శంకరయ్య యాదవ్, చెంచులక్ష్మి మనవడు చైతన్య యాదవ్ పుట్టిన రోజు సందర్భంగా పేదలకు అన్నదానం చేశారు. కౌన్సిలర్ అనిల్‌కుమార్, వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి మాట్లాడుతూ వలసాని స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా పేదలకు సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కొండయ్య, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పుస్తక పఠనం ముఖ్యం

రాజుపాళెం : వేసవి శిక్షణలో భాగంగా రాజుపాళెంలోని గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు పుస్తక పఠనం చేసినట్లు గ్రంథాలయ అధికారి ఎస్.ప్రతాపుడు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతాపుడు మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకం చదవడం వల్ల విజ్ఞానం, జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. ఇందులో భాగంగా నీతికథలు, బాలల గేయాలు, వేమన పద్యాలు, సుమతి శతకం వంటివి చదివించామని ఆయన తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి


ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి

పోరుమామిళ్ల : పట్టణంలో ప్రధాన రహదారి డివైడర్ పనులు జరుగుతుండటం, మరో వైపు ట్రాఫిక్ బాగా పెరగడం కారణంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడిందని ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్టేషన్‌లో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులతో మాట్లాడారు. దుకాణాల ముందు వాహనాలు నిలపడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్నందున దానిపై దుకాణాల యజమానులకు అవగాహన కల్పించామన్నారు. పట్టణంలో సీసీ కెమెరాలు పని చేస్తున్నాయన్నారు. పాత్రికేయుల సహకారంతో ముందుకు వెళతామన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం


వలంటీర్లకు పురస్కారాలను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

బి.కోడూరు : వలంటీర్లు చేసిన సేవలు అభినందనీయమని మండల జెడ్పీటీసీ ఎస్.దావీదు తెలిపారు. బుధవారం మండలంలోని బి.కోడూరు సచివాలయంలో జెడ్పీటీసీ, ఎంపీపీ కోడూరు చెన్నమ్మ, వైస్ ఎంపీపీ చంద్రశేఖరరెడ్డి, మాధవరెడ్డి, ఎంపీటీసీ రామకోటి, సర్పంచ్ మునిరెడ్డిల చేతులమీదుగా వలంటీర్లకు సేవారత్న, సేవామిత్ర పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మినరసారెడ్డి, పంచాయతీ సెక్రటరీ నాగేంద్ర, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఈకేవైసీ నమోదుకు నేడే ఆఖరు

గోపవరం : ఇప్పటి వరకు ఈకేవైసీ నమోదు చేయించుకోని రైతులు గురువారం సాయంత్రంలోపు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి అరవిందనాయక్ తెలిపారు. ఈకేవైసీ నమోదు కాని వారికి పీఎం కిసాన్ వర్తించదన్నారు. ఈకేవైసీ, ఎన్‌పీసీఐ లింక్ చేయని రైతుల వివరాలను ఆయా రైతు భరోసా కేంద్రాలలో జాబితాలు పొందుపరిచామన్నారు. ఆ జాబితాలో పేర్లు ఉన్న రైతులు ఆయా రైతుభరోసా కేంద్రాలకు వెళ్లి ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు. అలాగే 40 శాతం సబ్సిడీతో మండలానికి డ్రోన్ మంజూరైందని, ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాల కోసం వ్యవసాయాధికారిని సంప్రదించాలని కోరారు.

నేడు లక్ష్మీపేటలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం

చాపాడు : మండలంలోని లక్ష్మీపేట గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వైద్యాధికారి కావ్య మాధురి ఆధ్వర్యంలో గ్రామస్తులు వైద్య పరీక్షలు నిర్వహించి 104 వాహనం ద్వారా అన్ని రకాలైన మందులను పంపిణీ చేస్తామన్నారు. అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

నేడు నాగలకుంట్లలో గడప గడపకు కార్యక్రమం

బద్వేలు/పోరుమామిళ్ల : పోరుమామిళ్ల మండలంలోని నాగలకుంట్ల (సంచర్ల) పంచాయతీలో గురువారం ఉదయం 7 గంటలకు, సాయంత్రం 3 గంటలకు అక్కలరెడ్డిపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నూర్జహాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డిలు పాల్గొంటారని చెప్పారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది తప్పక హాజరు కావాలని ఆమె కోరారు.

క్రికెట్ వైపు యువత చూపు

సమ్మర్ క్రికెట్‌లో జోరుగా శిక్షణ


క్యాచ్‌లలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆటల్లో క్రేజ్ ఉన్న ఆట క్రికెట్. చిన్నా పెద్దా అంతా ఈ ఆట ఆడేందుకు, చూసేందుకు ఆసక్తి కనబరుస్తారు. కొంత మంది గ్రౌండ్‌లో ఎలాంటి శిక్షణ లేకుండా ఈ ఆట ఆడుతుండగా మరి కొందరు నిపుణులతో శిక్షణ పొందుతున్నారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలోని నెట్స్‌లో యూత్ క్రికెట్‌క్లబ్ ఆధ్వర్యంలో సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో క్రికెట్‌లో ఉచితంగా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణలో భాగంగా రోజూ ఉదయం 6 నుంచి 8 గంటల వరకు ఫిట్‌నెస్‌లో శిక్షణ,ఫీల్డింగ్, బ్యాటింగ్‌లో మెళకువలు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు బ్యాటింగ్ స్కిల్స్ డిఫెన్స్, కట్ షాట్, పుల్‌షాట్, క్యాచెస్ ప్రాక్టీస్, ఫీల్డింగ్ డ్రిల్స్, ఆఫ్‌స్పిన్, లెగ్‌స్పిన్, బౌలింగ్ డ్రిల్‌లో శిక్షణ ఇస్తున్నారు. కోచింగ్ క్యాంప్‌కు అవసరమైన బాళ్లు, బ్యాట్‌లు, క్రికెట్ కిట్‌లను కడప డిస్ట్రిక్ క్రికెట్ అసోసియేషన్ వారు సమకూర్చారు. సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో 110 మంది క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారు. ఈ శిక్షణ జూన్ 11వ తేదీ వరకు జరగనుంది. 16 ఏళ్లుగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వంద మందిపైగా క్రీడాకారులకు ఉచితంగా క్రికెట్‌లో శిక్షణ ఇచ్చి మంచి ఆటగాళ్లుగా వారిని తీర్చిదిద్దుతున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి పోటీలలో రాణించడంతో పాటు జాతీయ స్థాయి పోటీలలో ప్రతిభ కనబరుస్తున్నారు. కొందరు విద్యార్థులు క్రికెట్‌లో రాణించి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు కూడా సాధించడం విశేషం.

క్రీడాభివృద్ధే లక్ష్యంగా



యూత్ క్రికెట్ క్లబ్ కడప డిస్ట్రిక్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను 16 ఏళ్లుగా నిర్వహిస్తోంది. ప్రతిభగల విద్యార్థులను గుర్తించి వారిని రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తున్నాం.

– నరేష్, క్రికెట్ కోచ్

మెళకువలు నేర్పిస్తున్నారు



బాడీ ఫిట్‌నెస్‌తోపాటు కోచ్ క్రీడలో అవసరమైన మెళకువలను, ఆడే విధానాన్ని నేర్పిస్తున్నారు. సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో బౌలింగ్, బ్యాటింగ్‌ల్లో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నా.

– జగదీశ్, క్రీడాకారుడు

ఉత్తమంగా రాణిస్తా



స్పిన్, డిఫెన్స్, డైవ్, క్యాచెస్, ఫీల్డింగ్‌లో గత మూడే నెలలుగా శిక్షణ తీసుకుంటున్నాను. భవిష్యత్తులో మంచి క్రీడాకారిణిగా రాణిస్తాను. భారతదేశం తరపున క్రికెట్ పోటీలలో ఆడాలన్నదే నా లక్ష్యం.

– సాయిసృజన, క్రీడాకారిణి

చిన్నగురువలూరులో బండలాగుడు పోటీలు


చిన్నగురువలూరులో బండలాగుతున్న ఎద్దు

చాపాడు : మండల పరిధిలోని చిన్నగురువలూరు గ్రామంలో శ్రీరామచంద్రస్వామి శిఖర, ధ్వజ, పెద్దమ్మతల్లి ప్రతిష్ఠ మహోత్సవాల సందర్భంగా బుధవారం బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీల్లో దువ్వూరు మండలం పెద్దభాకరాపురం గ్రామానికి చెందిన వేంపల్లె గణేష్ ఎద్దులు ప్రథమ స్థానంలో నిలవగా, తొండూరు మండలం గంగాదేవిపల్లెకు చెందిన మారుతి వరప్రసాద్‌రెడ్డి ఎద్దులు రెండో స్థానంలో, చాపాడు మండలం చియ్యపాడు గ్రామానికి చెందిన బోగిరెడ్డి వీరతేజ రెడ్డి ఎద్దులు మూడో స్థానంలో, ప్రొద్దుటూరు మండలం ఈశ్వర్ రెడ్డినగర్‌కు చెందిన ఎం.కేశవ ఎద్దులు నాలుగో స్థానంలో నిలిచాయి. చెన్నూరు మండలం రాచిన్నాయపల్లె గ్రామానికి చెందిన బాబయ్య ఎద్దులు ఐదో స్థానంలో, చాపాడు మండలం చియ్యపాడుకు చెందిన కమాల్ బాషా ఎద్దులు ఆరో స్థానంలో గెలుపొందాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు వరుసగా రూ.35వేలు, రూ.30వేలు, రూ.25వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు చొప్పున నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాలగిరి ఎల్లారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వేమారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పైలెట్ వెంటసుబ్బారెడ్డి, శివారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

బద్వేలు అర్బన్ : రైల్వేశాఖలో ఖాళీగా ఉన్న 3.15 లక్షల పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.చిన్ని పేర్కొన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోనే అతి పెద్ద రవాణా సంస్థ అయిన రైల్వేశాఖలో ఖాళీలను భర్తీ చేయకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఏటా కోటి ఉద్యోగాలు యువతకు ఇస్తామని మోడీ చెప్పిన హామీ అమలుకు నోచుకోలేదన్నారు. సమావేశంలో డీవైఎఫ్ఐ పట్టణ నాయకులు నాగార్జున, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన మహిళ మృతి

మైదుకూరు : మండలంలో వనిపెంటకు చెందిన ముద్దం సుభద్ర (44) అనే మహిళ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందింది. వనిపెంటలోని వడ్డెర కాలనీకి చెందిన సుభద్ర ఇతర కూలీలతో కలసి మంగళవారం ఉత్సలవరం గ్రామానికి కూలి పనికి వెళుతూ, గోడేరు వంక వద్ద ఆటో నుంచి కిందపడి తీవ్రంగా గాయపడింది. ఆమెను ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మైదుకూరు పోలీసులు తెలిపారు. మృతురాలి కుమారుడు సుబ్బరాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రామచంద్ర తెలిపారు.

కారు అపహరణపై ఫిర్యాదు

అట్లూరు: ఆలయం ముందు ఉంచిన కారు అపహరణకు గురైంది. ఈమేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అట్లూరుకు చెందిన నీలం ప్రసాద్ ఆర్టీసీలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అట్లూరు క్రాస్‌రోడ్డులో ఉన్న ఆంజనేయస్వామి ఆలయానికి కారులో బయలుదేరారు. ఆలయం ముందు కారును పార్క్‌చేశారు. పూజల అనంతరం బయటకు వచ్చి చూస్తే కారు కనించలేదు. వెంటనే నీలం ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ కేసీ రాజు తెలిపారు.

సర్వసభ్య సమావేశానికి అధికారులు డుమ్మా!


మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి

బి.కోడూరు : మండల కేంద్రంలోని వెలుగు సభాభవనంలో బుధవారం ఎంపీపీ కోడూరుచెన్నమ్మ అధ్యక్షతన, ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి జెడ్పీటీసీ ఎస్.దావీదు, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మాధవరెడ్డిలు హాజరయ్యారు. కానీ మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు డుమ్మా కొట్టారు. రెవెన్యూ, విద్యుత్, ఆర్‌అండ్‌బీలతో పలు శాఖల అధికారులు, కొంత మంది ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కాకపోవడంపై ఎంపీపీ చెన్నమ్మ, ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. మౌలిక వసతుల కల్పన కోసం ఒక ప్రణాళికను రూపొందించుకుని ముందుకు వెళ్లాల్సి ఉండగా అధికారులు హాజరుకాకపోవడంపై ఉన్నతాధికారుల దృష్టి శాఖాపరమైన చర్యలకు సిఫార్సు చేస్తామన్నారు. అధికారులు, పలువురు సభ్యులు లేకపోవడంతో సమావేశాన్ని నామమాత్రంగా జరిపారు. సమావేశంలో ఎంపీటీసీ రామకోటి, సర్పంచ్‌లు మునిరెడ్డి, లక్ష్మినరసారెడ్డి, వైద్యాధికారి డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, పశువైద్యాధికారి భరద్వాజకృష్ణ, ఎంఈఓ మురళీదేవి, వ్యవసాయాధికారి కౌశిక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాము, హౌసింగ్ ఏఈ వెంకటసుబ్బయ్య, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలో మైనార్టీలకు ఒరిగిందేమీ లేదు


మాట్లాడుతున్న కౌన్సిలర్ ఇర్ఫాన్ బాషా

ప్రొద్దుటూరు : రాష్ట్రంలోని మైనారిటీలకు తమ పాలనలో ఏం ఒరగబెట్టిందో టీడీపీ స్పష్టం చేయాలని 13వ వార్డు కౌన్సిలర్ ఇర్ఫాన్ బాషా తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రొద్దుటూరు చరిత్రలో ఇంత పెద్ద ఎత్తున సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు ఏనాడు జరగలేదన్నారు. మున్సిపాలిటీలో రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు, ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. లోకేష్ యువగళం పాదయాత్రలో టీడీపీ నాయకులు పట్టణంలో అభివృద్ధి జరగలేదని విమర్శలు చేయడాన్ని ఆయన తప్పుపట్టారు. ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి టీడీపీ నాయకుల కళ్లకు కనిపించలేదా అని ప్రశ్నించారు. చంద్రబాబు మైనారిటీల అభివృద్ధికి ఏనాడూ ఆలోచించలేదన్నారు. లోకేష్ పాదయాత్రలో మైనారిటీల అభివృద్ధికి తీసుకునే చర్యలపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం దురదృష్టకరమన్నారు. మైనారిటీ కౌన్సిలర్లు వెల్లాల మహమ్మద్ గౌస్, షేక్ జిలాని, వడ్ల ఖలీలుల్లా, 25వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి నూరి పాల్గొన్నారు.

వైభవంగా కుంభాభిషేక మహోత్సవాలు


సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించిన దృశ్యం

బద్వేలు అర్బన్ : లక్ష్మీపాలెంలో ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి విమాన గోపురం ,రాజగోపురం నూతనంగా నిర్మించిన సందర్భంగా నిర్వహిస్తున్న కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ఆదిదేవత, గరుడ, అనంత, ఆంజనేయ దేవతా మూలమంత్ర హోమము, చక్రాబ్జమండల హోమం నిర్వహించి సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మెంటా అశోక్‌కుమార్, ఆలయ ఈఓ సి.శివయ్య, ఆలయ కమిటీ సభ్యులు నాగమణి, చంద్రయ్య, పెద్దవీరయ్య, రమణమ్మ, లక్షుమ్మ, సుబ్బయ్య, వెంకటసుబ్బమ్మ, చిన్నగురవయ్య, ఆలయ ప్రధాన అర్చకులు కామసముద్రం లక్ష్మీవెంకటవరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధి కోసం పోరాటాలకు సిద్ధం కావాలి


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

ప్రొద్దుటూరు : జిల్లా సమగ్రాభివృద్ధి కోసం పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర తెలిపారు. మండలంలోని పెన్నానగర్ సీపీఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాద విధానాలతో నేడు లౌకిక వాదం ప్రమాదంలో పడుతోందన్నారు. రాయలసీమకు అందాల్సిన నీళ్లు, నికర జలాలు, నిధుల కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ఈనెల 10, 11, 12 తేదీల్లో బ్రహ్మంగారిమఠంలో సీపీఐ జిల్లా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో నిష్ణాతులైన ప్రొఫెసర్లు హాజరవుతారని తెలిపారు. శిక్షణా తరగతుల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సీపీఐ ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు, సమితి సభ్యులు శివారెడ్డి, షరీఫ్, మచ్చా శ్రీను, వై.హరి, యేసోబ్, ప్రమీల పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట వేడుకలు


ఎమ్మెల్యే రఘురామిరెడ్డి దంపతులను సన్మానిస్తున్న పీఆర్ అండ్ ఆర్డీ సలహాదారు నాగార్జున రెడ్డి

చాపాడు : మండల పరిధిలోని చిన్నగురువళూరు గ్రామంలో బుధవారం శ్రీరామ చంద్ర స్వామి శిఖ, ధ్వజ పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, ప్రభావతమ్మ దంపతులు, బ్రహ్మంగారి మఠం అచలానంద ఆశ్రమ పీఠాధిపతి విరజానంద స్వామి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రకాలైన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్షుమయ్య, సింగిల్ విండో చైర్మన్ వేమారెడ్డి, సర్పంచ్ ఎల్లారెడ్డి, పెద్దగురువళూరు గ్రామ సర్పంచ్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రఘురామిరెడ్డి దంపతులకు సన్మానం

మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, ప్రభావతమ్మ దంపతులను పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి సన్మానించారు. చిన్నగురువళూరు గ్రామంలో బుధవారం జరిగిన రామచంద్ర స్వామి శిఖర, ధ్వజ పెద్దమ్మ తల్లి ప్రతిష్ట మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే దంపతులను సతీసమేతంగా నాగార్జునరెడ్డి దంపతులు శాలువ, పూలమాల వేసి జ్ఞాపిక అందజేశారు.

మంచి మార్గంలో నడవడం ముఖ్యం


చర్చి ప్రారంభ వేడుకలో ఎమ్మెల్యే రాచమల్లు, రాయలసీమ బిషప్ వరప్రసాద్, పాస్టర్లు

రాజుపాళెం : దైవాన్ని ప్రార్థించడంతో పాటు సమాజంలో సరైన మార్గాన్ని ఎంచుకొని జీవించాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. మండలంలోని కూలూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో నూతనంగా రూ.70 లక్షలతో నిర్మించిన సీఎస్ఐ చర్చిని, శిలాఫలకాన్ని ఎమ్మెల్యే రాచమల్లు, రాయలసీమ బిషప్ డాక్టర్ పెయ్యల ఐజాక్ వరప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవుని మందిరంలో ప్రార్థన చేస్తేనే దైవానుగ్రహం కలుగుతుందని అనుకోవద్దన్నారు. వాటితో పాటు సమాజ అభివృద్ధి, ఇతరులకు సేవ చేయడం, ఇంకా చేతనైతే కొద్దోగొప్పో సాయం చేయడం నేర్చుకోవాలన్నారు. చర్చి నిర్మాణానికి తన వంతు సాయంగా రూ.13 లక్షలు ఇచ్చానని, ఇదేదో మీతో లబ్ధిపొందేందుకు కాదని, దైవానుగ్రహంలో కాస్త తనకు చోటు దక్కుతుందన్న ఆశతో ఈ సాయం చేశానని చెప్పారు. రాయలసీమ బిషప్ వరప్రసాద్ మాట్లాడుతూ అందరి సహకారంతో చర్చిని ఎంతో అద్భుతంగా నిర్మించామన్నారు. ఇంతటి నిర్మాణానికి సహాయ, సహకారాలు అందించిన ఎమ్మెల్యే రాచమల్లుకు ఆ ఏసుప్రభు దీవెనలు ఎల్లప్పుడూ ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజారాంరెడ్డి, మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ శ్రీధర్, వైఎస్సార్ సీపీ నాయకుడు సుబ్బారెడ్డి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ జ్ఞానానందం, పాస్టర్లు, ఆయా గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సంఘ పెద్దలు, కాలనీ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డు, డ్రైనేజీ కాలువ పనులకు భూమి పూజ


భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : స్థానిక 13వ వార్డు శంకర్రావు వీధిలో రూ.20లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డు, డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి మాట్లాడుతూ వార్డు కౌన్సిలర్ ఇర్ఫాన్ బాషా అభ్యర్థన మేరకు రూ.20లక్షలతో సిమెంటు రోడ్డు, డ్రైనేజీ కాలువల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. పట్టణంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ నాలుగేళ్ల పాలనలో మున్సిపాలిటీ పరిధిలో సుమారు రూ.100 కోట్లతో అభివృద్ధి పనులను పూర్తి చేసి వాటి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించామన్నారు. రెండు మూడు రోజుల్లో అభివృద్ధి పనులకు టెండర్లు ప్రకటిస్తున్నామని రాజకీయ పార్టీలు ముందుకొచ్చి టెండర్లు దక్కించుకోవాలని టీడీపీకి చురకలంటించారు. అధికార పార్టీపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. టీటీడీ పాలకమండలి సభ్యుడు టంగుటూరు మారుతిప్రసాద్, కౌన్సిలర్లు ఇర్ఫాన్ బాషా, సత్యం, గరిశపాటి లక్ష్మీదేవి, జిలాని, వెల్లాల మహమ్మద్ గౌస్, వడ్ల ఖలీలుల్లా, కమాల్ బాషా, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద, నాయకులు నూరి, మీగడ చంద్రశేఖర్, బలిమిడి చిన్నరాజు, పోసా భాస్కర్, బీఎస్ఆర్, గంజికుంట ఆంజనేయులు, ద్వార్యల గురునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ స్వచ్ఛంద రక్తదానం చేయాలి


రక్తదానం కార్యక్రమంలో రాజగోపాల్, డాక్టర్లు

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని సీమాంధ్ర బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చల్లా రాజగోపాల్ అన్నారు. స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో బుధవారం ఆయన పుట్టినరోజు సందర్భంగా చల్లా ఫౌండేషన్, ఫ్రెండ్స్ బ్లడ్ డోనర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తలసేమియా వ్యాధి చిన్నారుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించారు.

రక్తదాన శిబిరంలో 60 యూనిట్లు దాతల నుంచి సేకరించారు. డాక్టర్ ప్రదీప్‌రెడ్డి, చిన్నపిల్లల వైద్యుడు రవీంద్ర, ఫిజియో థెరపిస్ట్ కృష్ణమోహన్, సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం నాయకులు, బీసీ నాయకులు పాల్గొన్నారు.